# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 316
పేజీలు : 08 | వెల: రూ.5/-
సోమవారం
సెప్టెంబర్ 29, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net







7లో..

## ఖండాంతరాల్లో బతుకమ్మ.. సంబురాలు

- ఆడి, పాడిన మహిళలు
- భక్తి శ్రద్ధలతో గౌరమ్మ పూజలు
- శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు



2లో..

## ఉన్నత లక్ష్యాలతో ఎదగాలి

- విద్య, ఉద్యోగాల్లో ఇప్పుడిప్పుడే రాణిస్తున్నారు
- అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షులు కందకట్ల స్వామి
- ఘనంగా పోపా ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవం
- పద్మశాలి విద్యార్థులకు సత్కారం

వివరాలు 8లో..



# అతివలదే ఆధిపత్యం

ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న స్థానిక ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. తొలుత జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించిన తర్వాత వార్డులు, సర్పంచ్ ఎన్నికలు నిర్వహించేలా ప్లాన్ చేశారు. అక్టోబర్ 9, 13న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసి అదే నెల 23న మొదటి విడత, 27న రెండో విడత ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నిర్ణయించింది. నవంబర్ 11న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. అదే విధంగా అక్టోబర్ 17,21,25 తేదీల్లో గ్రామ పంచాయతీలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి అక్టోబర్ 31, నవంబర్ 4,8 తేదీల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నిక ప్రక్రియను పూర్తి చేసి అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. అదే రోజు ఫలితాలు వెలువడనున్నాయి. దీంతో గత 18 నెలల పాటు ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగిన గ్రామ పంచాయతీలకు విముక్తి లభించనుంది. 1 ఫిబ్రవరి 2024లో గ్రామ పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసింది. మరుసటి రోజునే గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. అయితే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పురుషులకంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నందున అతివలే ఆధిపత్యం ప్రదర్శించే అవకాశం ఉంది. – వరంగల్ వాయిస్ ప్రతినిధి

- స్థానిక సంస్థలకు మోగిన నగారా
- షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల సంఘం
- మూడు విడతల్లో సర్పంచ్ ఎన్నికలు
- అదే రోజు కౌంటింగ్
- రెండు విడతల్లో ఎంపీపీ, జడ్పీటీసీ ఎన్నికలు
- నవంబర్ 11న కౌంటింగ్



8లో..

## క్రికెట్ అభిమానులపై.. విరిగిన పోలీస్ లాఠీ

- సంబురాలు చేస్తుండగా దాడులు
- పలువురికి గాయాలు


















# ఉన్నత లక్ష్యాలతో ఎదగాలి

## పద్మశాలి ప్రతిభాపురస్కార్ -2025

**పద్మశాలిల చరిత్ర పురాతన కాలానికి చెందినది. వారు భవన ఋషి నుంచి ఉద్భవించారని, సృష్టికర్త అయిన విష్ణువు పవలించే తామర తొడిమె నుంచి వచ్చిన పోగులతో నేతపని ప్రారంభించారని నమ్ముతారు. 'పద్మ' అంటే తామర, 'శాలి' అంటే నేత అని అర్థం, కనుక పద్మశాలి అంటే తామర నుంచి వస్త్రాలను నేసేవారని ప్రచారంలో ఉంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో వీరి ప్రాతినిధ్యం అధికంగా కనిపిస్తుంది. ప్రధానంగా నేతపనితో పాటు బ్రాహ్మణులతో సమానమైన సంప్రదాయాలను పద్మశాలీలు కలిగి ఉంటారు. పద్మశాలీల్లో ఉన్న ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడమే లక్ష్యంగా పద్మశాలి ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (పోపా) ఆవిర్భవించింది. ఉద్యోగులతోపాటు విద్యార్థుల్లో ప్రతిభావంతులను గుర్తించి ప్రతి ఏడు పురస్కారాలు ప్రధానం చేస్తూ వారికి కొండంత అండగా పోపా నిలుస్తోంది.**

– వరంగల్ వాయిస్, హనుమకొండ

- **విద్య, ఉద్యోగాల్లో ఇప్పుడిప్పుడే రాణిస్తున్నారు**
- **అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షులు కందకట్ల స్వామి**
- **ఘనంగా పోపా ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవం**
- **పద్మశాలి విద్యార్థులకు సత్కారం**

ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ప్రతిభావంతులైన పద్మశాలి విద్యార్థులను ప్రోత్సహించడంలో భాగంగా, పద్మశాలి ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (పోపా) ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండలోని జిల్లా పరిషత్ హాల్‌లో ప్రతిభా పురస్కార్ అవార్డ్స్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షులు కందకట్ల స్వామి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకుని, నిరంతర కృషి, పట్టుదలతో ముందుకు సాగాలని ఆయన సూచించారు. సివిల్స్, గ్రూప్స్ పరీక్షల్లో మన పద్మశాలీయులు ఇప్పుడిప్పుడే రాణిస్తున్నారన్నారు. విద్యా రంగంతో పాటు రాజకీయాలలో కూడా ముందుకు రావాలని కందకట్ల స్వామి పిలుపునిచ్చారు. మరొక ముఖ్య అతిథి, రాష్ట్ర పోపా అధ్యక్షుడు, న్యాయవాది శామంతుల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివితే సాధించలేనిది ఏదీ ఉండదన్నారు. నిరుపేద విద్యార్థులకు తమ వంతు చేయూతనివ్వాలని ఆయన సంఘ సభ్యులను కోరారు.

### ప్రోత్సహించడమే లక్ష్యం..

పోపా జిల్లా అధ్యక్షుడు గుండు కామేశ్వర్ మాట్లాడుతూ విద్యార్థులలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడమే తమ సంఘం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. డాక్టర్ కూరపాటి రమేష్ మాట్లాడుతూ, ప్రతిభ గల విద్యార్థులకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. పద్మశాలి జాతీయ ఉపాధ్యక్షులు గుండు ప్రభాకర్ మాట్లాడుతూ, పోపా ప్రతిభా అవార్డుల కార్యక్రమం సామాజిక చైతన్యాన్ని, సంఘటితత్వాన్ని పెంపొందిస్తుందని అన్నారు.

### అన్ని రంగాల్లో రాణిస్తూ..

సీనియర్ జర్నలిస్ట్ గడ్డం కేశవమూర్తి మాట్లాడుతూ పిల్లలు తప్పనిసరిగా తల్లిదండ్రుల మాటలు విని, మంచి చదువులు చదువుకోవాలని, తల్లిదండ్రులు చేసిన వివాహాలనే చేసుకుని ఆదర్శవంతమైన జీవితాన్ని మలచుకోవాలని సూచించారు. పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, పద్మశాలి బిడ్డలు అనేక రంగాలలో రాణిస్తున్నారని, ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న మన వారిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అనంతరం ప్రతిభ కనబరిచిన పద్మశాలి విద్యార్థులకు పురస్కారాలను ప్రధానం చేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాము శ్రీనివాస్, గోషికొండ సుధాకర్, బైరి శ్యాంసుందర్, మాటేటి అశోక్, సంతోష్, ధర్మపురి రాజగోవింద్, దిడ్డి అనిల్, బొద్దున వెంకటేశ్వర్లు, బత్తుల సత్యం, గుండేటి సతీష్, కందకట్ల రాకేష్, వట్నాల సత్యనారాయణ, గుండు రవి, అతిథులు డాక్టర్ వన్నాల వెంకటరమణ, కుసుమ సతీష్, వైద్యం రాజగోపాల్, డాక్టర్ కూరపాటి రాధిక, డాక్టర్ అంబటి అజయ్, మోతె రాజకుమార్, శ్రీరాముల శ్రీనివాస్, డాక్టర్ చింతకింది శ్రీనివాస్, విటోభ, సుభాష్, రమేష్, రగుల భరత్ తదితరులు పాల్గొన్నారు.







# సర్వాయి పాపన్న గౌడ్ కాంస్య విగ్రహానికి భూమి పూజ

◆ పాపన్న స్ఫూర్తితో రాజ్యాధికారంలోకి రావాలి
◆ పెరుమాండ్ల మధుసూదన్ గౌడ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కాంస్య విగ్రహ నిర్మాణానికి సోమవారం భూమి పూజ కార్యక్రమం జరిగింది. హనుమకొండ హంటర్ రోడ్ వద్ద ఉన్న గౌడ హాస్టల్ భవనం ప్రాంగణంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన గోపా వ్యవస్థాపక అధ్యక్షుడు పెరుమాండ్ల మధుసూదన్ గౌడ్ మాట్లాడుతూ బహుజనులు రాజ్యాధికారంలోకి రావడానికి పాపన్న గౌడ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. 350 సంవత్సరాల క్రితమే మొగల్ చక్రవర్తుల అరాచకాలను చూసి చలించిన పాపన్న గౌడ్, తన చుట్టూ ఉన్న బహుజన కులాలను ఏకం చేసి, వారికి యుద్ధ మెళకువలు నేర్పి మొగల్ చక్రవర్తులపై దండయాత్ర చేసి వారి కోటలను కూలగొట్టి, బహుజన రాజ్యాన్ని స్థాపించిన గొప్ప వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. ప్రతి గ్రామంలో, వాడ వాడలో గౌడ కులస్తులు పాపన్న గౌడ్ విగ్రహాలను నెలకొల్పాలి. పాపన్న స్ఫూర్తితో బహుజనులు రాజకీయాల్లో రాణించాలని అన్నారు. ఈ భూమి పూజ కార్యక్రమంలో గోపా వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బైరి లక్ష్మీనారాయణ గౌడ్, గోపా హనుమకొండ జిల్లా అధ్యక్షులు డాక్టర్ చిర్ర రాజు గౌడ్, గోపా గ్రేటర్ జిల్లా అధ్యక్షులు పులి శ్రీనివాస్ గౌడ్, కార్పొరేటర్ పోశాల పద్మ-స్వామి గౌడ్, వరంగల్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు తీగల జీవన్ గౌడ్, సీనియర్ జర్నలిస్ట్ పెరుమాండ్ల వెంకటేశ్వర గౌడ్ పాల్గొన్నారు.విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు బోనగాని యాదగిరి గౌడ్, వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, బత్తిని రమేష్ గౌడ్, అంబలా సూర్యనారాయణ గౌడ్, జనగాం శ్రీనివాస్ గౌడ్, తాళ్లపెల్లి సురేష్ గౌడ్, డా. బొమ్మెర కుమార్ గౌడ్, మార్క రవి గౌడ్, జులూరి రంజిత్ గౌడ్, గట్టు నరేష్ గౌడ్, కునూరు రంజిత్ గౌడ్, బండారి జనార్ధన్ గౌడ్, మాచర్ల శరత్ గౌడ్, ఆనంతుల రమేష్ గౌడ్, శ్రీపతి గోపి గౌడ్, తాబేటీ వెంకన్న గౌడ్, జనగాం వెంకటేశ్వర్లు గౌడ్, గౌని సాంబయ్య, బుర్ర శ్రీనివాస్ గౌడ్, పులి మోహన్ గౌడ్, బొమ్మగాని ఆదర్శ్ గౌడ్, శ్రీపతి రమేష్ గౌడ్, పెరుమాండ్ల అనిల్, తీగల లక్ష్మణ్ గౌడ్, పంజల జ్ఞానేశ్వర్, చిర్ర సుమన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ హెచ్ఎం ఉద్యోగులకు బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జాతీయ ఆరోగ్య మిషన్ లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ ఎన్ హెచ్ ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా హృదయపూర్వక సద్దుల బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ శుభ పర్వదినం సందర్భంగా యూనియన్ నాయకుడు తమ ఉద్యోగులందరి జీవితాల్లో సంతోషం, శ్రేయస్సు కలగాలని ఆకాంక్షించారు. అదే సమయంలో, ఈ పండుగ వేళలో తమ దీర్ఘకాలిక సమస్యలు అన్నీ పరిష్కారం కావాలని, ఉద్యోగులందరికీ తగిన న్యాయం జరగాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# డీఎస్పీగా సంఘాల జేశ్వంత్ రాజ్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇటీవల ప్రకటించిన గ్రూప్-1 ఫలితాల్లో డీఎస్పీ (డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్) ఉద్యోగానికి ఎంపికైన హనుమకొండ జిల్లా వాస్తవ్యుడు సంఘాల జేశ్వంత్ రాజ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శనివారం నియామక పత్రాన్ని అందుకున్నారు. మల్టీ జోన్-1 పరిధిలో జేశ్వంత్ రాజ్ 139వ ర్యాంకు సాధించి ఈ విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఈయన సంఘాల రవి ప్రసన్న దంపతుల కుమారుడు. జేశ్వంత్ రాజ్ డీఎస్పీగా నియామక పత్రాలు అందుకోవడంపై ఆయన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్తులు తీవ్ర హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. యువతకు ఆదర్శంగా నిలిచిన జేశ్వంత్ రాజ్ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

# రిషితకు 3వ డాన్ బ్లాక్ బెల్ట్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండకు చెందిన ఎస్ఎంఎ తైక్వాండో అకాడమీకి అరుదైన గౌరవం లభించింది. అకాడమీకి చెందిన ప్రతిభావంతురాలైన క్రీడాకారిణి వేముల రిషిత న్యూఢిల్లీలో జరిగిన అత్యున్నత పరీక్షలో ఉత్తీర్ణత సాధించి 3వ డాన్ బ్లాక్ బెల్ట్ సర్టిఫికేట్‌ను గెలుచుకుంది. న్యూఢిల్లీలోని కొరియన్ కల్చరల్ సెంటర్‌లో కుక్కీవాన్ ఇండియా నార్త్ బ్రాంచ్ ఆధ్వర్యంలో 2025 సెప్టెంబర్ 26 నుంచి 28 వరకు కుక్కీవాన్ హై డాన్ ట్రైనింగ్ సెమినార్, పరీక్ష నిర్వహించారు. రిషిత ఈ పరీక్షలో పాల్గొని విజయం సాధించింది. రిషితతో పాటు ఎస్ఎంఎ తైక్వాండో అకాడమీ చీఫ్ కోచ్ గౌతమ్ యాదవ్ కూడా సాధనలో పాల్గొనడం, ఆమె నైపుణ్యాన్ని మరింత అభివృద్ధి చేసుకోవడానికి దోహదపడింది. ఈ ప్రతిష్టాత్మక డాన్ సర్టిఫికేట్‌ను ప్రముఖ తైక్వాండో గ్రాండ్ మాస్టర్లు అయిన గ్రాండ్ మాస్టర్ సియోంగ్ రాన్ సోయెల్, డా. జోసెఫ్ లీ (కుక్కీవాన్ ఇండియా చైర్మన్), గ్రాండ్ మాస్టర్ జిమ్మీ చేతుల మీదుగా రిషితకు ప్రదానం చేశారు. తైక్వాండోలో ఉన్నత స్థాయికి చేరిన వేముల రిషిత భవిష్యత్తులో మరిన్ని మహిళా క్రీడాకారులకు ఆదర్శంగా నిలుస్తుందని కోచ్ గౌతమ్ యాదవ్ పేర్కొన్నారు. ఆయన మార్గదర్శకత్వం మరియు ప్రోత్సాహంతోనే రిషిత ఈ విజయాన్ని సాధించగలిగిందని అకాడమీ సభ్యులు అభినందించారు.

# భూమా నందినికి 'యంగ్ ఛాంపియన్ అవార్డు'



**వరంగల్ వాయిస్, దుగ్గొండి :** వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం మల్లంపల్లి గ్రామానికి చెందిన యువ ప్రతిభావంతురాలు భూమా నందిని అరుదైన గౌరవాన్ని దక్కించుకుంది. ఆమె ఇటీవల 'యంగ్ ఛాంపియన్ అవార్డు'తో పాటు 'వరల్డ్ రికార్డ్ ఆఫ్ ఎక్సలెన్స్ సర్టిఫికేట్'ను నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఫైన్ ఆర్ట్స్ అండ్ అవార్డ్స్ (ఎన్ఐఎఫ్ఏఏ) నుంచి అందుకున్నారు. సెప్టెంబర్ 22న న్యూఢిల్లీలోని భారత మండపం వేదికగా జరిగిన కార్యక్రమంలో ప్రముఖులు నందినికి ఈ అవార్డులను ప్రదానం చేశారు. చిన్న వయస్సులోనే నందిని సాధించిన ఈ విజయాలు ఆమె పట్టుదల, కష్టపడే నైపుణ్యం, అసాధారణ ప్రతిభకు నిదర్శనం అని ఆమె సహచరులు అభినందించారు. దేశస్థాయిలో ఇంతటి మహోన్నతమైన అవార్డును అందుకున్న నందినిని సోమవారం బీజేపీ కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ శాలువాతో సన్మానించి అభినందించారు. రానున్న రోజుల్లో ఆమె మరింత ఉన్నత శిఖరాలకు ఎదిగేలా తన సహాయ సహకారాలు ఉంటాయని ఈ సందర్భంగా ఆయన భరోసా కల్పించారు.

# సన్మార్గంలో పయనించాలంటే దైవభక్తి తప్పనిసరి

## కార్పొరేటర్ మరుపల్ల రవి



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** నేటి యువత దైవభక్తి కలిగి ఉన్నప్పుడే సన్మార్గంలో పయనించడానికి దుర్గామాత ఆశీస్సులు ఉంటాయని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. సోమవారం 40వ డివిజన్‌లోని ఉర్సు పద్మశాలి సేవా భవనంలో, పద్మశాలి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని కార్పొరేటర్ మరుపల్ల రవి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రాత్రులు నిష్ఠతో, కఠినమైన నియమావళితో పూజలు నిర్వహించి దీక్ష తీసుకున్న స్వాములకు తల్లి అనుగ్రహం తప్పక లభిస్తుందన్నారు. ప్రతి మనిషిలో దైవభక్తి పెరుగుతుందని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఆ వ్యక్తులపైనే ఉంటుందని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సేవా భవన అధ్యక్షులు కనుకుంట్ల రవి, దీక్షా స్వాములు కనుకుంట్ల శివసాయి, గుడిమల్ల అన్వేష్, మంద శివకుమార్తో పాటు ఇతర భవాని మాత స్వాములు పాల్గొన్నారు.

# శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఎమ్మెల్యే నాయిని



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి నియోజకవర్గంలోని పలు దేవాలయాలు, దుర్గామాత మండపాలను సందర్శించారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం హనుమకొండలోని శ్రీ శ్రీ శ్రీ సిద్దేశ్వరాలయాన్ని ఎమ్మెల్యే నాయిని తన అల్లుడు, కాంగ్రెస్ నాయకులు విష్ణు వర్ధన్ రెడ్డితో కలిసి సందర్శించి, ఆలయ పండితుల వేద మంత్రాల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 54వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాన్ని సందర్శించి పూజలు చేశారు. ఆ తర్వాత, 4వ డివిజన్‌లో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 52 అడుగుల అత్యంత భారీ దుర్గామాత విగ్రహాన్ని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఇంత భారీ విగ్రహాన్ని ప్రతిష్ఠించిన కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. అలాగే, కాజీపేటకు చెందిన కడిపికొండ, విష్ణుపురి వాటర్ ట్యాంక్, పోలీస్ స్టేషన్ వద్దగల మండపాలను సందర్శించారు. వరంగల్ మట్టెవాడ, ఎంజీఎం కూడలిలో ఏర్పాటు చేసిన మండపాల్లోని దుర్గామాతను కూడా నాయిని రాజేందర్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో అంగరంగ వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం సంతోషంగా ఉందని, తొమ్మిది రోజులు నిష్ఠతో, భక్తి శ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అమ్మవారి దయ, కరుణాకటాక్షాలతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు విష్ణు వర్ధన్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు పోతుల శ్రీమాన్, జక్కుల రవీందర్, సయ్యద్ విజయశ్రీ రజాలి, గుంటి శ్రీనివాస్, రవీందర్, కాంగ్రెస్ బ్లాక్ ప్రెసిడెంట్లు, స్థానిక డివిజన్ ప్రెసిడెంట్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కలను నెరవేరుస్తాం

▪ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఇందిరమ్మ రాజ్యంలోనే పేద ప్రజల సొంత ఇంటి కల సాకారం అవుతుందని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. పేదవారి ఇంటి కలను నెరవేర్చే లక్ష్యంతో హనుమకొండ అంబేద్కర్ భవన్‌లో వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలోని 1, 55, 56, 65 డివిజన్లకు చెందిన 40 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఆయన మంజూరు పత్రాలను అందజేశారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రూ. 22,500 కోట్లతో 4.5 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టింది. అందులో భాగంగా వర్ధన్నపేట నియోజకవర్గంలో రూ. 175 కోట్లతో 3,500 ఇళ్లు నిర్మించబోతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఒక్కో ఇంటికి రూ. 5 లక్షల చొప్పున 4 విడతలలో నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ అవుతుంది. లబ్ధిదారుల ఎంపిక రాజకీయాలకు అతీతంగా, పారదర్శకంగా జరిగిందని, అధికారులు సర్వే చేసి అర్హులను గుర్తించారని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఎవరైనా డబ్బులు ఇచ్చినట్లు తెలిస్తే ఇల్లు రద్దు చేసి, డబ్బులు తీసుకున్న వారిని కచ్చితంగా జైలుకు పంపిస్తానని ఎమ్మెల్యే నాగరాజు గట్టిగా హెచ్చరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా ఇల్లు ఇచ్చే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. మంజూరు అయినవారు త్వరగా నిర్మాణం పూర్తి చేసుకొని సంక్రాంతి వరకు గృహ ప్రవేశం చేయాలని కోరారు. ఆరోగ్యశ్రీని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచామని, సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని, తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉచితంగా సన్న బియ్యం, రైతు భరోసా, ఉచిత విద్యుత్ వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు.తన గెలుపు కోసం కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పిస్తానని, అయితే కేటీఆర్ వంటి వారు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలకు ఫామ్ హౌస్‌లో ఉండే బాస్ కావాలా, నిత్యం ప్రజల్లో ఉండే లీడర్ కావాలా తేల్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రాం నరసింహారెడ్డి, పాక్స్ చైర్మన్ బిల్లా ఉదయ్ కుమార్ రెడ్డి, ఐనవోలు ఆలయ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ఆవుల పవన్ కళ్యాణ్‌తో పాటు ఇతర నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు. సమస్యల పరిష్కారం కోసం తన డయల్ యువర్ ఎమ్మెల్యే (8096107107) నంబర్‌కు ఫోన్ చేయాలని ఎమ్మెల్యే కోరారు.

# ఘనంగా చండీ హోమం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** శ్రీ హనుమద్గిరి పద్మాక్షి దేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా సోమవారం ఎనిమిదవ రోజు పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 4:30 గంటలకు మూలమూర్తికి షోడశ కలశాలతో, సరస్వతీ సూక్తంతో అర్చకులు అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 8:30 గంటలకు అమ్మవారిని మహా సరస్వతి అలంకరణలో అలంకరించి ప్రత్యేక అర్చనలు జరిపారు. విద్యార్థినీ విద్యార్థులు ఉన్నత విద్యలో పురోగతి సాధించేలా సరస్వతీ సూక్తంతో హోమం, అలాగే చండీ హోమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర పీసీసీ కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనివాస్ బాబు తమ సతీమణితో కలిసి ఈ చండీ హోమాన్ని నిర్వహించారు. రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలని కోరుకుంటూ ఈ హోమం నిర్వహించినట్లు వారు తెలిపారు.

# జఫర్‌గఢ్ ఎస్సైపై సస్పెన్షన్ వేటు



**వరంగల్ వాయిస్, క్రైం :** జనగామ జిల్లా, వర్ధన్నపేట ఏసీపీ పరిధిలోని జఫర్‌గఢ్ ఎస్సై రామ్ చరణ్‌ను సస్పెండ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సీపీ సన్ ప్రీత్ సింగ్ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్సై రామ్ చరణ్ ఫిర్యాదుదారుల నుంచి డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలు రావడంతో, పోలీసు ఉన్నతాధికారులు విచారణ జరిపి సీపీకి నివేదిక సమర్పించారు. ఈ నివేదిక ఆధారంగా కమిషనర్ సస్పెన్షన్ ఆదేశాలు జారీ చేశారు. రామ్ చరణ్‌కు ఇది రెండోసారి సస్పెన్షన్ కావడం గమనార్హం. గతంలో ఆయన మహబూబాబాద్ జిల్లాలోని పెద్దవంగర ఎస్సైగా పనిచేస్తున్న సమయంలో, ఉప్పరగూడెం గ్రామ సర్పంచ్ భర్తను కొట్టినట్లు ఆరోపణలు రావడంతో అప్పట్లో కూడా సస్పెండ్‌కు గురయ్యారు.

# నాణ్యతతో విజయవంతం

## బేకరి, స్వీట్స్ షాప్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



**వరంగల్ వాయిస్, రేగొండ:** వ్యాపారంలో నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇస్తే తప్పక విజయం సాధించవచ్చని భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఉమ్మడి రేగొండ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన మైసూర్ బేకరి, స్వీట్స్ షాప్ గ్రాండ్ ఓపెనింగ్ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ఈ నూతన బ్రాంచ్‌ను ఆయన ప్రారంభించారు. ముందుగా ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే జీఎస్ఆర్‌కు షాపు యజమాని ముని స్వామి పుష్పగుచ్ఛంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మైసూర్ బేకరి, స్వీట్స్ షాప్ యజమానులను అభినందించారు. మండల ప్రజలకు నాణ్యమైన స్వీట్స్ అందించాలని కోరుతూ, వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం బేకరి యజమాని మునిస్వామిని శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఆర్ చైర్మన్ నాయినేని సంపత్ రావు, పీఏసీఎస్ చైర్మన్ నడిపెల్లి విజ్జన్ రావు, భూపాలపల్లి వ్యవసాయ కమిటీ చైర్మన్ గుటోజు కిష్టయ్య, మాజీ ఎంపీపీ పున్నం లక్ష్మీ రవి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్పకాయల నర్సయ్య, కాంగ్రెస్ జిల్లా నాయకులు మోడెం ఉమేష్ గౌడ్, మాజీ ఎంపిటిసి మైస భిక్షపతి సుమలత, కాంగ్రెస్ పార్టీ రేగొండ టౌన్ అధ్యక్షుడు ఏనుగు రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బండారి దేవేందర్, సత్తన్న యువసేన అధ్యక్షులు మోట్టే కిరణ్ పటేల్, సత్తన్న యువసేన నాయకులు సామల సురేందర్ రెడ్డి, మైసూర్ బేకరి నిర్వాహకులు ముకేష్‌తో పాటు స్థానిక నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ సరస్వతి రూపంలో రేణుక అమ్మవారు



**వరంగల్ వాయిస్, జనగామ :** స్థానిక బాలాజీ నగర్‌లోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా, ఎనిమిదవ రోజు సోమవారం అమ్మవారు శ్రీ సరస్వతి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. త్రిశక్తులలో ఒక స్వరూపం అయిన చదువుల తల్లి సరస్వతి దేవి అలంకారాన్ని దర్శించుకోవడమే మహాభాగ్యంగా భక్తులు భావించారు. దేవిని దర్శించుకొని ఆరాధిస్తే బుద్ధి వికాసం, విద్యాలాభం కలుగుతుందని, జ్ఞాన ప్రదాతగా కొలుస్తారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారిని తెలుపు రంగు వస్త్రాలు, వీణా వాయిణిగా అలంకరించి, దద్దోజనం, పాయసాలను నైవేద్యంగా నివేదించారు. అనంతరం మంగళారతులతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి మారుపాక శ్యాం ప్రసాద్, లగిశెట్టి పద్మావతి, దూడల శోభారాణి, మోటె రేణుక, ఆలేటి పద్మ, బాలలక్ష్మి, వాణి, లలిత, బండోజు సరళ, మినులాపురం శోభా, రూప, జ్ఞానమ్మ తదితర భక్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# దుర్గా నవరాత్రి ఉత్సవాల్లో మంత్రి కొండా సురేఖ



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** కాశిబుగ్గ చౌరస్తాలో శ్రీ విజయ దుర్గా భవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న దేవి నవరాత్రి ఉత్సవాలలో తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ దేవి నవరాత్రి ఉత్సవాలను ప్రతిరోజు ఘనంగా నిర్వహిస్తున్నందుకు శ్రీ దుర్గా భవాని యూత్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గోపాల్ నవీన్ రాజ్, 21వ డివిజన్ కార్పొరేటర్ పూర్ణచందర్, అరుణం సంతోష్ వర్మ, సాయి కిరణ్, నరేష్, సతీష్, శ్రవణ్, సాయి, సందీప్, అఖిల్ రాజ్, వంశీ, ఐలోని అఖిల్, నితిన్, యూత్ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# గుమాస్తా కార్మికులకు దసరా బోనస్ ఇవ్వాలి

◆ ముక్కెర రామస్వామి డిమాండ్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** దసరా పండుగ సందర్భంగా వరంగల్‌లోని షాపుల్లో పనిచేస్తున్న గుమాస్తా కార్మికులకు బోనస్ ప్రకటించాలని ఆల్ షాప్ గుమస్తాల సంఘం డిమాండ్ చేసింది. ఆల్ షాప్ గుమస్తాల సంఘం ఆధ్వర్యంలో వరంగల్ చౌరస్తాలో వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఏఐసీటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర రామస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముక్కెర రామస్వామి మాట్లాడుతూ దుకాణాలలో పనిచేస్తున్న గుమాస్తా కార్మికులకు ప్రస్తుతం ఇస్తున్న వేతనంపై ఒక నెల జీతాన్ని బోనస్‌గా ఇవ్వాలని యాజమాన్యాలను కోరారు. కొంతమంది యజమానులు సానుకూలంగా స్పందించి బోనస్ ఇస్తామని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ఆయన వివరించారు. యజమానుల వద్ద పనిచేస్తున్న గుమాస్తాలకు ఎలాంటి గుర్తింపు లేదు. ఈఎస్ఐ, పీఎఫ్, సర్వీస్ బెనిఫిట్స్, బోనస్, ఎస్ ఫామ్స్ వంటి సౌకర్యాలు కల్పించడం లేదు. రోజుకు 10 నుంచి 12 గంటలు పనిచేయించుకుంటూ అతి తక్కువ వేతనాలు ఇచ్చి, వెట్టిచాకిరి చేయించుకుంటున్నారు. నిత్యవసర ధరలు పెరగడం వల్ల తక్కువ జీతంతో కుటుంబాలను పోషించుకోలేక దుర్భర జీవితాలు గడుపుతున్నారు. మహిళా కార్మికులకు కేవలం రూ. 5,000 నుంచి రూ. 8,000 మాత్రమే ఇస్తూ శ్రమను దోచుకుంటున్నారు. జీతం పెంచమని అడిగితే ఉన్న జీతం తగ్గించి, టార్గెట్లు పెట్టి ఇబ్బంది పెడుతున్నారని, 'నీ ఇష్టం ఉంటే ఉండు, లేకుంటే వెళ్ళిపో'మని యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ, పెట్టుబడిదారులు, యాజమాన్యాలకు అనుకూలంగా చట్టాలు తిరగదోడుతోందని, కార్మికులను నూతన బానిసత్వంలోకి నెట్టే ప్రయత్నం చేస్తోందని ముక్కెర రామస్వామి విమర్శించారు. కార్మికుల హక్కులను కాపాడడం కోసం, పెరిగిన ధరలకు అనుగుణంగా గుమాస్తా కార్మికులకు కనీస వేతనం నెలకు రూ. 26,000 ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు కె. రమేష్, జి. నరేందర్, శ్రీనివాసు, కుమారస్వామి, సంతోష్, రమ, సుజాత, వాణి, పుష్ప, పద్మ, సరిత, అనిత, సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

# శంకరమఠంలో శ్రీ సరస్వతి దేవి దర్శనం

## ◆ ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే నాయిని

**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని శ్రీ శృంగేరి శంకర మఠం శ్రీ శారదాంబ సన్నిధానంలో జరుగుతున్న శ్రీ శారదా శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. పీఠాధిపతులు, ఉభయ జగద్గురువులు శ్రీ భారతీ తీర్థ మహాస్వామి, శ్రీ విధుశేఖర భారతీ స్వామి ఆశీస్సులతో, అమ్మవారు చదువుల తల్లి శ్రీ సరస్వతి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం ఆశ్వయుజ శుద్ధ సప్తమి, మూలా నక్షత్రం కావడంతో, ప్రధానార్చకులు సంగమేశ్వర జోషి, చంద్రశేఖర శర్మ, బలరాం మిశ్రాలు శ్రీ శారదా అమ్మవారిని చదువుల తల్లి సరస్వతి దేవిగా విశేషాలంకరణ చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి శంకరమఠాన్ని సందర్శించి, శ్రీ సరస్వతి దేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు అర్చకులు వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలతో ఆయనకు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి శ్రీ సరస్వతి హోమం పూర్ణాహుతిలో పాల్గొని, అనంతరం అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని, ప్రజలు సుఖశాంతులతో ఉండాలని అమ్మవారికి పూజలు చేసినట్లు తెలిపారు.



ఈ సందర్భంగా హాజరైన మహిళా భక్తులకు ఎమ్మెల్యే బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. చదువుల తల్లి సరస్వతి దేవిగా వీణ ధరించి దర్శనం ఇచ్చిన అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత చిన్నారులకు అక్షరాభ్యాసాలు జరిగాయి. అమ్మవారి పూజ చేసిన పెన్నులను చిన్నారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శంకర సేవా సమితి సభ్యులు కుమారస్వామి, దేవేందర్, కొమురయ్య రామారావు, సర్వేశ్వర్, రవీందర్, రాజేంద్రప్రసాద్, మురళీధర్, పద్మ, సంధ్యారాణి తదితరులు భక్తులకు సేవలు అందించారు.

# డాక్టర్ కూరపాటి మధుకు ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ప్రపంచ హార్ట్ దినోత్సవం సందర్భంగా ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ కూరపాటి మధును సోమవారం కాశీబుగ్గ వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గత 10 సంవత్సరాలుగా గుండె వైద్య నిపుణులుగా విశిష్ట వైద్య సేవలు అందిస్తూ ప్రజల ప్రశంసలు అందుకుంటున్న డాక్టర్ మధుకు సమితి సభ్యులు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి శాశ్వత అధ్యక్షుడు కూరపాటి సుదర్శన్, కోశాధికారి వంగరి రవి, సభ్యులు ఆరె రమేష్ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అల్లుడు, రాష్ట్ర కాంగ్రెస్ యువజన నాయకుడు విష్ణు వర్ధన్ రెడ్డి సోమవారం నియోజకవర్గంలోని పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. మొదటగా, కాకతీయ యూనివర్సిటీ వద్ద గల హనుమాన్ నగర్‌లో ఎన్ జీఓల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'వెల్‌నెస్, ఎంపవర్‌మెంట్ సెంటర్'ను ఆయన కాంగ్రెస్ సీనియర్ నేత బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విష్ణు వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఈ సెంటర్ మానసిక ఉల్లాసానికి, విద్యార్థుల మెదడు శక్తిని పెంపొందించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. నిర్వహకులను ఆయన అభినందించారు. అనంతరం ఆయన లష్కర్ బజార్ వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం, నియోజకవర్గంలోని బుద్ధ భవన్ వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాతను దర్శించుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన అన్నదాన వితరణ కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. అంతకుముందు, దుర్గామాత మండపాల నిర్వాహకులు విష్ణు వర్ధన్ రెడ్డికి ఘన స్వాగతం పలికి, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో విష్ణు వర్ధన్ రెడ్డితో పాటు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, యూత్ నాయకులు, మహిళలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ డీలర్లకు కమీషన్ ఇప్పించండి

## జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేత



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గత ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న తమ కమీషన్ బకాయిలను విడుదల చేయాలని కోరుతూ ధర్మసాగర్ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రేషన్ డీలర్లు సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 426 మంది రేషన్ డీలర్ల తరపున, రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెలల నుంచి రేషన్ పంపిణీకి సంబంధించిన కమీషన్ విడుదల చేయకపోవడం వల్ల తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను కలెక్టర్‌కు విన్నవించారు. తమకు న్యాయం చేయాలని వారు కలెక్టర్‌ను కోరారు. రేషన్ డీలర్ల విజ్ఞప్తికి కలెక్టర్ స్నేహ శబరీష్ సానుకూలంగా స్పందించారు. ఈ సమస్యను తక్షణమే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, డీలర్లకు కమీషన్ అందే విధంగా చూస్తానని ఆమె హామీ ఇచ్చారని సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వల్లపురెడ్డి రవీందర్ రెడ్డి, గడ్డం నాగేశ్వర్ రావు గౌడ్, సోంపెల్లి రవీందర్, చింతలపాని అన్వేష్ రెడ్డి, గడ్డం నాగేశ్వర్ రావు, పిల్లి రవీందర్, రవి రెడ్డి, లక్ష్మీనారాయణ,సంపెల్లి విజయకుమారి, బి. అరుణ, పి. విమల తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహా అన్నదానం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలోని నూతన మిత్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా, ఎనిమిదో రోజు ఉదయం అర్చకులు అమ్మవారిని మహా సరస్వతి అలంకరణలో తీర్చిదిద్ది, ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ అన్నదాన, పూజా కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు.

# పెటికి సంఘం కమిటీ ఎన్నిక

## నూతన అధ్యక్షుడిగా పత్తిపాక చంద్రశేఖర్



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** మండలంలోని నీరుకుళ్ల గ్రామంలోని పెటికి సంఘం నూతన కమిటీ ఎన్నిక ఆదివారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో జరిగింది. కుల పెద్దలు, సభ్యులు ఏకగ్రీవంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా పత్తిపాక చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా పత్తిపాక చంద్రశేఖర్ ఉపాధ్యక్షుడు సింగతి రమేష్, ప్రధాన కార్యదర్శి లక్కర్స్ రాజు, సహాయ కార్యదర్శి లక్కర్స్ జగదీశ్వర్, కోశాధికారి అంకతి రాజు, ప్రచార కార్యదర్శి కీత రాజు, కార్యవర్గ సభ్యులుగా లక్కర్స్ రాకేష్, పోతరాజు రాంబాబు, లక్కర్స్ సుధాకర్, అంకతి రవి లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు చంద్రశేఖర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇంత పెద్ద బాధ్యతను అప్పగించిన కుల పెద్దలందరికీ ధన్యవాదాలు తెలిపారు. తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ, సంఘం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

# 'న్యాయం గెలిచింది' – విజయచందర్ రెడ్డి

## ◆ బీజేపీ నాయకులపై అక్రమ కేసులు కొట్టివేత

**వరంగల్ వాయిస్, పరకాల:** గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాజకీయ వేధింపుల లక్ష్యంగా నమోదు చేసిన అక్రమ కేసులో బీజేపీ నాయకులకు న్యాయస్థానంలో ఊరట లభించింది. ఈ కేసును న్యాయస్థానం కొట్టివేసింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షులు ఎడ్ల అశోక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ సోమవారం కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అన్యాయంగా మాపై కేసులు పెట్టి, ప్రజల మధ్య మా ప్రతిష్టను దెబ్బతీయాలని ప్రయత్నించారు. కానీ, న్యాయమే గెలిచింది." అని పేర్కొన్నారు. "బీజేపీ నిజాయితీతో, ప్రజాసేవ కోసం చేసే పోరాటాన్ని ఎవరూ అడ్డుకోలేరు. మా ప్రయాణం ప్రజల ఆశీర్వాదాలతో కొనసాగుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు కేసులు నమోదు చేసినా, నిజం ఎప్పటికీ గెలుస్తుందని ఈ తీర్పు మరోసారి నిరూపించిందని బీజేపీ నాయకులు అన్నారు. ప్రజల సేవ కోసం నిస్వార్థంగా పనిచేసే బీజేపీ నాయకులపై అణచివేత చర్యలు విఫలమవుతాయని ఈ సంఘటన చాటి చెబుతోందని తెలిపారు.



ఈ కేసులో బీజేపీ నాయకుల తరపున న్యాయవాది గంద్ర నరేష్ రెడ్డి వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా కచం గురు ప్రసాద్, ఆర్పీ జయంత్ లాల్, కొండి జితేందర్ రెడ్డి, దేవునూరి మేఘనాథ్, గురజాల శ్రీరామ్ రెడ్డి, గాజుల నిరంజన్, ఎరుకల దివాకర్, మార్తా భిక్షపతి, గోగుల రాజిరెడ్డి, ఇర్సడ్ల సదానందం, సంఘ పురుషోత్తం, పాలకుర్తి తిరుపతి, బెజ్జంకి పూర్ణచారి, పుట్టా రవీందర్, ఆకుల రాంబాబు, బసాని సోమరాజు, ఎదులపురం శ్రవణ్ కుమార్, కట్టగాని శ్రీకాంత్, శాంతేన్ రెడ్డి, గణేష్, గడ్డం రమేష్, సముద్రాల రవి తదితర బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇద్దరు ఇన్‌స్పెక్టర్ల బదిలీ

**వరంగల్ వాయిస్, క్రైం :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం పోలీస్ కంట్రోల్ రూమ్ ఇన్‌స్పెక్టర్గా విధులు నిర్వహిస్తున్న డి. విశ్వేశ్వర్ను గీసుగొండ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. గీసుగొండ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏ. మహేందర్ను పోలీస్ కంట్రోల్ రూమ్ ఇన్‌స్పెక్టర్ గా నియమిస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

# కాంపౌండ్ వాల్ పనులు వేగవంతం చేయాలి

◆ జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండలోని వెహికల్ షెడ్ ప్రాంతంలో జరుగుతున్న కాంపౌండ్ వాల్ పనులను, అలాగే సమీపంలో ఉన్న రెండు పడక గదుల సముదాయంలో నీటి సరఫరా వసతి కల్పన కోసం చేయాల్సిన ఏర్పాట్లను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. బాలసముద్రంలోని వెహికల్ షెడ్ ప్రాంతంలో బల్దియా నిర్మిస్తున్న కాంపౌండ్ వాల్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలి. రెండు పడక గదుల ఇండ్ల సముదాయంలో ప్రస్తుతం నివాసం ఉంటున్న వారికి నీటిని వినియోగించుకోవడానికి వీలుగా ఉన్న ఉమ్మడి సంపునకు కార్పొరేషన్ నీటిని సరఫరా చేస్తుందని తెలిపారు. అయితే, సంపు నుంచి వాటర్



ట్యాంకులకు నీటిని పంపించే పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ పరిశీలన: ఇదే ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థను కూడా కమిషనర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఓ డా. రాజేష్, ఈఈ రవి కుమార్, డీఈలు రాజ్ కుమార్, రాగి శ్రీకాంత్, శానిటరీ సూపర్‌వైజర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కోగిల్వాయి సర్పంచ్ బీజేపీ అభ్యర్థిగా చుక్క అనిత మహేందర్




**వరంగల్ వాయిస్, దామెర :** కోగిల్వాయి గ్రామ సర్పంచ్ స్థానం ఎస్సీ మహిళకు కేటాయించిన సందర్భంగా, భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తరఫున అభ్యర్థిగా చుక్క అనిత మహేందర్ ను ఎంపిక చేశారు. ఈ మేరకు గ్రామ బీజేపీ పార్టీ నాయకులందరూ ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుని, మండల పార్టీ ద్వారా జిల్లా పార్టీకి పంపడం జరిగింది. ఈ నిర్ణయం తీసుకున్న సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండి జితేందర్ రెడ్డి, మండల మాజీ అధ్యక్షులు జంగిలి నాగరాజు, గ్రామ బీజేపీ బూత్ అధ్యక్షులు చుక్క మహేందర్, గడబోయిన రమేష్ యాదవ్, పెరుగు కుమార్, పి.రాజు, ఎస్.వేణు, గాజు శ్యామ్, పున్నం చందు తదితర నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ప్రదానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** విద్యారంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో, ఆదివారం సాయంకాలం హనుమకొండ సుబేదారిలోని అవోపా భవనంలో అవోపా (పద్మశాలి ఆఫీసర్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్) హనుమకొండ యూనిట్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. 2024-25కు గాను 60 రకాల కోర్సులలో అత్యధిక ఉత్తీర్ణత మార్కులు సాధించిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ఇచ్చి సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.రాంచంద్రం హాజరై వివిధ కోర్సులలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అవోపా అధ్యక్షుడు దొంతుల ఈశ్వరయ్య మాట్లాడుతూ విద్యార్థులు వారి భవిష్యత్తు జీవితంలో ఇంకా ఉన్నత స్థాయిలో చదువుకుంటూ, ఉన్నత ఉద్యోగాలు చేసుకుంటూ సమాజసేవకు ఉపయోగపడాలని ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో అవోపా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ గుండా రవీందర్, హనుమకొండ కార్యదర్శి కమతాల భాస్కర రావు, కోశాధికారి గంప సతీష్, వర్కింగ్ ప్రెసిడెంట్ గన్ను సురేందర్, దొడ్డ మోహన్ రావు, కొదుమూరి రమేష్, ప్రకాశం, దేవేందర్, నాగభూషణం, శివకుమార్, రవీందర్, శ్రీనివాస్, పృథ్వీరాజు, రాజశేఖర్ గారితో పాటు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# తాటికొండ రాజయ్య ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య దేవి నవరాత్రి ఉత్సవాలలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజయ్య మాట్లాడుతూ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలు, ముఖ్యంగా రఘునాథపల్లి మండల ప్రజలు ఎల్లప్పుడూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఆనందంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇంచార్జి వై.కుమార్ గౌడ్, మండల కన్వీనర్ మున్సిపల్ విజయ్, రవికుమార్ తో పాటు మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ ప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# బతుకమ్మ వేడుకల్లో ప్రణవ్ సందడి



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** మండల కేంద్రంలో ఘనంగా జరిగిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి వొడితల ప్రణవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను ఆసక్తిగా తిలకించి, మహిళలతో కలిసి ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. తెలంగాణలో అతి పెద్ద పండుగ బతుకమ్మ అని వొడితల ప్రణవ్ అన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు ఆయన తెలిపారు.

# వేదాంత్ లర్నింగ్ సెంటర్‌లో బతుకమ్మ వేడుకలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాంనగర్‌లో గల వేదాంత్ లర్నింగ్ సెంటర్‌లో బతుకమ్మ వేడుకలు అత్యంత ఘనంగా, సందడిగా జరిగాయి. కళాశాలలోని మొదటి సంవత్సరం విద్యార్థినులు తీరొక్క పువ్వులతో బతుకమ్మలను పేర్చి, ఉల్లాసంగా ఆటపాటలతో పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ ఐలి కర్నాకర్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు బతుకమ్మ పండుగ ఎంతో ప్రత్యేకం అని అన్నారు. విద్యార్థినులు చేసిన సందడి, పండుగ వాతావరణం, వారు ప్రదర్శించిన వివిధ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వేదాంత్ లర్నింగ్ సెంటర్ బ్రాంచ్ మేనేజర్ సోమేశ్వరరావు, జోనల్ మేనేజర్ పూర్ణచందర్, రాజు, సిబ్బంది రాధాకృష్ణ, రాజేష్ కోటి, చందు, మాస్టర్ టీచర్స్ హేమంత్ స్వస్తిక్, నీరజ్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆడపడుచులందరికీ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

## బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ జిల్లా ఆడపడుచులందరికీ బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. సద్దుల బతుకమ్మ పర్వదినాన్ని పురస్కరించుకుని, ఆయన శివనగర్‌లోని మెట్లబావి ధనమైసమ్మ దేవాలయం వద్ద తోట బాబన్న ఆధ్వర్యంలో మరియు నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న బతుకమ్మ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ పండుగ మన తెలంగాణ ఆడపడుచుల పండుగ అని, తీరొక్క పువ్వులను అందంగా పేర్చి పండుగ జరుపుకోవడమే కాకుండా, ఆ పువ్వులనే దేవుళ్లుగా పూజించే గొప్ప సంస్కృతి, సంప్రదాయం మన తెలంగాణ సొంతమన్నారు. గడ్డి పోచను కూడా గౌరమ్మగా భావించి, గౌరవించే ఈ ఉదాత్తమైన పండుగ మన బతుకమ్మ. పూలను దైవంగా భావించే ప్రకృతి పండుగ ఇది. బతుకును ఇచ్చే తల్లి బతుకమ్మ దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేసి మనందరినీ చల్లగా చూస్తుంది. ఆ గౌరమ్మ తల్లి ఆశీస్సులతో వరంగల్ ప్రజలు, ఆడపడుచులు సుఖ సంతోషాలతో, అష్టైశ్వర్యాలతో కలకాలం వర్ధిల్లాలని ప్రార్థిస్తూ జిల్లా ఆడపడుచులందరికీ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పండుగల వేళ నిరంతర విద్యుత్ సరఫరా

**వరంగల్ వాయిస్, రేగొండ :** బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా వినియోగదారులకు ముఖ్యంగా ఉత్సవాలలో విద్యుత్ అంతరాయం కలగకుండా నిరంతర పర్యవేక్షణతో విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఉమ్మడి రేగొండ మండల ట్రాన్స్‌కో ఏఈ వంగ రాజు తెలిపారు. సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు సద్దుల బతుకమ్మ ఉత్సవాలు, మహిళల ప్రీతిపాత్రమైన బతుకమ్మ ఏర్పాట్లలో నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా గత వారం రోజులుగా చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఏఈ వంగ రాజు ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది ఉమ్మడి రేగొండ, గోరికొత్తపల్లి మండలాల్లోని గ్రామాలను సందర్శిస్తున్నారు. ఆటంకాలు తలెత్తకుండా సిబ్బందికి ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తూ, బతుకమ్మ ఆట స్థలాలను పరిశీలించారు. గత వారం రోజుల నుంచి ఉమ్మడి మండలంలో విద్యుత్ సరఫరాకు ఆటంకాలు లేకుండా ఉండేందుకు మధ్యాహ్నం వేళల్లో చెట్ల కొమ్మలను తొలగించే పనులను చేపట్టారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా నిత్యం సరఫరా జరుగుతుందని, అయితే కొమ్మలను తొలగించే సమయంలో



విద్యుత్‌ను కొంతసేపు ఆపివేయడం జరుగుతుందని, ఈ సమయంలో వినియోగదారులు సహకరించాలని ఏఈ వంగ రాజు కోరారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తమ సిబ్బందితో కలిసి నిత్యం గ్రామాల్లో పర్యవేక్షణ చేస్తున్నామని, పండుగల వేళ మహిళలకు విద్యుత్ ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని ఏఈ రాజు వివరించారు. ఈ పర్యవేక్షణలో ఏఈ వంగ రాజుతో పాటు ట్రాన్స్‌కో సిబ్బంది, లైన్ మెన్లు రామన్న, రవీందర్, శ్రావణ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
సోమవారం, సెప్టెంబర్ 29, 2025

# ఖండాంతరాల్లో బతుకమ్మ.. సంబురాలు

- **ఆడి, పాడిన మహిళలు**
- **భక్తి శ్రద్ధలతో గౌరమ్మ పూజలు**
- **శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు**

**వరంగల్ వాయిస్, హనుమకొండ, శివనగర్, కాశీబుగ్గ, నడికూడ, రేగొండ :** బతుకమ్మ.. ఓ సంబురం.. సంతోషం.. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక.. సగటు తెలంగాణ ఆడపడుచులకు ఇంతకంటే పెద్ద పండగ ఏదీ లేదు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పూలను దేవతగా కొలిచే అరుదైన పండుగ. తీరొక్క పూలను తెచ్చి.. అందంగా పేర్చి.. బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ ఆటపాటలతో భక్తి శ్రద్ధలతో ప్రకృతిని, పూలను పూజించే గొప్ప పండుగ ఇది. బతుకమ్మ పండుగలో చివరి రోజు సద్దుల బతుకమ్మగా కీర్తిస్తూ మహిళలు సంతోషంగా ఆడి, పాడే పండుగ ఇది. బతుకమ్మ సందర్భంగా బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ సతీమణి నవనీత స్వయంగా బతుకమ్మను పేర్చారు. వరంగల్ జిల్లా ఆడపడుచులందరికి సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. రేగొండ మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో పొద్దు పోయాక తీరొక పాటలతో సందడి చేసి నీటివనరుల్లో బతుకమ్మను నిమజ్జనం చేశారు. తల్లి చల్లంగా చూడు అంటూ ఏడాదికి మళ్లీ రమ్మని గౌరమ్మను సాగనంపారు. మహిళలు ఒకరికొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. నడికూడ మండలంలో సద్దుల బతుకమ్మ వేడుకలను మహిళలు ఉత్సాహంగా జరుపుకున్నారు. సద్దుల బతుకమ్మ పండుగ తేదీపై కొంత గందరగోళం నెలకొన్నప్పటికీ స్థానిక పూజారులు, ప్రజా ప్రతినిధుల సూచనలతో సోమవారం రోజునే జరపాలని నిర్ణయించారు. నగరంలోని కాశీబుగ్గ ప్రాంతం 19, 20 డివిజన్ లలో సోమవారం సద్దుల బతుకమ్మ పండుగను అంగరంగ వైభవంగా నిర్వహించారు. తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో ఆడపడుచులు సందడి చేశారు. ఊరు, వాడ ఒక్కటై బతుకమ్మ పాటలు పాడుతూ గౌరమ్మ చల్లంగ చూడంటూ వేడుకున్నారు. ఒకరికొకరు వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మహిళలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

### వాషింగ్టన్ లో..

అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలో గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ (జీటీఏ) వారి ఆధ్వర్యంలో సోమవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా కుడా మాజీ చైర్మన్, ఆర్గనైజేషన్ ఫర్ బ్యాక్వర్డ్ క్లాసెస్ ఓబీసీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా బతుకమ్మ సంబరాలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని సుందర్ రాజ్ యాదవ్ అన్నారు. తెలంగాణ ఆడపడుచులు తొమ్మిది రోజులు ఎంతో ఉత్సాహంగా జరుపుకునే పండుగ బతుకమ్మ పండుగ అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ సంస్థ చైర్మన్ విశ్వేశ్వర కలువల, ఉపాధ్యక్షులు శ్రవణ్ పాడూరు, వాషింగ్టన్ డీసీ అధ్యక్షులు రాము ముంద్రాతి, పూర్వ అధ్యక్షులు తిరుమల్ మునుకుంట్ల, ట్రెజరర్ సుధీర్ ముద్దసాని, సమర్ నంది, స్టాండింగ్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ పొట్టి, ఇంటెర్నేషనల్ కో-ఆర్డినేటర్ నర్సి దోమ, ఉపాధ్యక్షులు కోట్య బానోత్, రఘు పాల్రెడ్డి, అమర్ అతికం, వాషింగ్టన్ డీసీ బతుకమ్మ కోర్ టీం వంశి సింగిరెడ్డి, ప్రముఖ మిమిక్రి కళాకారుడు వికాస్ ఉల్లి, సాయి వికాస్, భాస్కర్ రెడ్డి, గణేష్ ముక్క, వేణు కలికోట, శ్రవంత్ గుండా, శ్రీని జూపల్లి, వెంకట్ దండ, సునీల్ కుడికాల, వరుణ్ కుసుమ, రాఘవేందర్ బుయ్యాని, ప్రేమ్ సాగర్, కోటేశ్ చిట్టిమల్ల తదితరులు పాల్గొన్నారు.





























# అతివలదే ఆధిపత్యం

- స్థానిక సంస్థలకు మోగిన నగారా
- షెడ్యూల్ విడుదల చేసిన ఎన్నికల సంఘం
- మూడు విడతల్లో సర్పంచ్ ఎన్నికలు
- అదే రోజు కౌంటింగ్
- రెండు విడతల్లో ఎంపీపీ, జడ్పీటీసీ ఎన్నికలు
- నవంబర్ 11న కౌంటింగ్

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం విడుదల చేసింది. తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరుగనున్నాయి. ఆ తర్వాత వార్డులు, సర్పంచ్ ఎన్నికలను నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 33 జిల్లాలుండగా ఇందులో గ్రామీణ నేపథ్యం లేని హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాలు మినహాయించి మిగిలిని 31 గ్రామీణ జాల్లాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశారు. గ్రామీణ జిల్లాల్లో మొత్తం 565 మండలాలుండగా, 565 జడ్పీటీసీ స్థానాలు, 5749 ఎంపీటీసీ స్థానాలకు రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు.

### రెండు విడతల్లో జడ్పీటీసీ ఎన్నికలు..

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను రెండు విడుతల్లో నిర్వహించనున్నట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. అక్టోబర్ 9న తొలివిడత, అక్టోబర్ 13న రెండో విడత ఎన్నికలు జరిపించేందుకు కసరత్తులు చేస్తున్నారు. నామినేషన్లను అక్టోబర్ 9 నుంచి 11 వరకు స్వీకరించనున్నారు. 12న నామినేషన్ల పరిశీలన, 15న నామినేషన్ల ఉపసంహరణ అదే రోజు పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నారు. అక్టోబర్ 23న ఉదయం 7 గంటలనుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు నిర్వహించనున్నారు. అదే విధంగా అక్టోబర్ 13వ తేదీన రెండో విడత ఎన్నికల షెడ్యూల్ ప్రకటన, అదే రోజునుంచి నామినేషన్ల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. 15వ తేదీ వరకు నామినేష్ల స్వీకరణ కు చివరి గడువు విధించారు. అక్టోబర్ 27 ఎన్నికలు నిర్వహించి నవంబర్ 11న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

### మూడు విడతల్లో సర్పంచ్ ఎన్నికలు..

వార్డు సభ్యులు, సర్పంచ్ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించనున్నారు. మొదటి విడతకు అక్టోబర్ 17నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభించి అక్టోబర్ 31వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికలను నిర్వహించనున్నారు. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభించి ఫలితాలను ప్రకటించనున్నారు. అదే



విధంగా రెండో విడత ఎన్నికలకు అక్టోబర్ 21న, మూడో విడత ఎన్నికలకు 25 నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. నవంబర్ 4న రెండో విడుత ఎన్నికలు నిర్వహించి అదే రోజు ఫలితాలను ప్రకటించనున్నారు. నవంబర్ 8న మూడో విడత ఎన్నికలు నిర్వహించి ఫలితాలను విడుదల చేయనున్నారు.

### అతివలదే పై చేయి..

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12,733 గ్రామ పంచాయతీలు, 1,12,288 వార్డుల్లో 1,67,03,168 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో పురుష ఓటర్లు 81,65,894, మహిళా ఓటర్లు 85,36,770 ఉండగా ఇతరులు 504గా గుర్తించారు. అయితే పురుష ఓటర్లకంటే మహిళా ఏటర్లే 3,70,876మంది అధికంగా ఉన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు కేటాయించిన 15,522 పోలింగ్ కేంద్రాల్లో 1,12,474 పోలింగ్ బూత్ లు ఏర్పాటు చేయనున్నారు.

మొదటి విడతలో 1,998 గ్రామ పంచాయతీలు ఉండగా.. 17 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. రెండో విడతలో 5,414 గ్రామపంచాయతీలు ఉండగా.. 47,890 వార్డులకు ఎన్నికలు నిర్వహించనుంది. మూడో విడతలో 5,521 గ్రామపంచాయతీలు ఉండగా.. 47,788 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. రెండు విడతల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరుగనున్నాయి. మొదటి విడతలో 2,963, రెండో విడతలో 2,786 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనుంది. మొదటి విడతలో 292, రెండో విడతలో 273 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఇందుకుగాను ఎంపీటీసీ ఎన్నికలకు 31,300 పోలింగ్ కేంద్రాలు, జడ్పీటీసీ ఎన్నికలకు 15,302 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

# క్రికెట్ అభిమానులపై.. విరిగిన పోలీస్ లాఠీ

- సంబురాలు చేస్తుండగా దాడులు
- పలువురికి గాయాలు



**వరంగల్ వాయిస్, క్రైం :** ఆసియా కప్ టోర్నీలో ఓటమన్నదే లేకుండా జైత్రయాత్ర సాగించిన భారత్, పాకిస్థాన్‌తో జరిగిన ఫైనల్‌లో అదే జోరు కొనసాగించింది. చిరకాల ప్రత్యర్థిపై విజయం సాధించడంతో సామాన్యుని నుంచి ప్రముఖుల వరకు సంతోషంతో సంబురాలు చేసుకున్నారు. యుద్ధ భూమిలోనూ, క్రికెట్ మైదానంలోనూ ఒక్కటే ఫలితమని రెండు ప్రాంతాల్లో ఇండియానే గెలిచిందంటూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ ఇతర ప్రముఖులు భారత జట్టుపై ప్రశంసల జల్లు కురిపిస్తుంటే వరంగల్ లో మాత్రం క్రికెట్ అభిమానులపై పోలీసుల లాఠీలు నాట్యమాడాయి. భారత్ గెలుపును పురస్కరించుకొని ఆదివారం రాత్రి యువకులు బట్టల బజార్ ప్రాంతంలో సంబురాలు చేసుకుంటుండగా పోలీసులు ఒక్క సారి దాడి చేసి తమ లాఠీలకు పని చెప్పారు. అసలు ఎం జరుగుతుంతో తెలుసుకునేలోనే పోలీసులు యువకులను చెల్లా చెదురు చేశారు. విచక్షణను కోల్పోయి అమాయక యువకులపై లాఠీలను ఝులిపించారు. దీంతో బతుకు జీవుడా అంటూ యువకు పరుగెడుతున్నా వెంటాడి వారిపై లాఠీ చార్జి చేశారు. దీంతో పలువురికి గాయాలయ్యాయి. గాయాలపాలైన యువకులు పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

### పోలీసుల తీరుపై ఆగ్రహం..

ఇండియా విక్టరీతో ఉప్పొంగిన ఆనందంతో సంబురాలు చేసుకుంటున్న యువకులపై పోలీసులు మూకుమ్మడిగా దాడి చేసి గాయపర్చడంపై స్థానికులు మండిపడుతున్నారు. పండుగ వేళ రోడ్డుపైనే బట్టీలు పెట్టి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నా ఏమాత్రం పట్టించుకోని పోలీసులు భారత్ విజయోత్సవాన్ని నిర్వహించకుండా అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అర్ధరాత్రి వరకు బిర్యానీ షాపులు తెరిచి వ్యాపారాలు నిర్వహించే వారిని ప్రేమతో పలకరించే పోలీసులు సంబరాలు భారత్ విజయోత్సవాలను జరుపుకుంటే లాఠీలకు పని చెప్పడంలో ఆంతర్యమేంటని నిలదీస్తున్నారు. దయాది దేశంపై విజయం సాధించిన క్రమంలో సంబరాలు చేస్తే లాఠీలు ఝులిపిస్తారా అంటూ ప్రశ్నిస్తున్నారు. ముడుపుల మత్తులో పోలీసులు తరిస్తున్నారని అందుకే అమాయక యువకులపై లాఠీ చార్జీ చేశారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# సరస్వతీమాతగా భద్రకాళి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ది గాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానంలో శ్రీ భద్రకాళి దేవి శరన్నవరాత్ర మహోత్సవాలు సోమవారం ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. ఉదయం అర్చకులు నిత్యాహ్నికం నిర్వర్తించి అమ్మవారిని సరస్వతీమాతగా అలంకరించి పూజారాధనలు జరిపారు. ఈ రోజు అమ్మవారు సాధకుడి బుద్దిలోకి ప్రవేశిస్తుంది. సరస్వతీ మాతగా అలంకరింపబడిన అమ్మవారి దర్శనంతో సాధకుడికి సకల విద్యలు సమకూరుతాయని ఆలయ ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు తెలిపారు. అమ్మవారికి ఉదయం భద్రపీఠ సేవ, సాయంకాలం అశ్వవాహన సేవ నిర్వహించారు. రేపు అనగా మంగళవారం భద్రకాళి అమ్మవారి జాన్మోత్సవం. దుర్గ భద్రకాళిగా కోటి యోగిని గణములతో ప్రాదుర్భావం చెందిన రోజు. బతుకమ్మ కూడా దుర్గాష్టమినాడే జన్మించిందని ఆనాడే చద్దులు చేయడమనేది తరతరాలుగా వస్తున్న సంప్రదాయం. ఈ రోజు కార్యక్రమాలకు సందెపూడి రవిశంకర్-మానస దంపతులు, ముప్పిడి సుధీర్ రెడ్డి-అర్పిత దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరించారు. ఉబయ దాతలకు పూజానంతరం అమ్మవారి శేషవస్త్రములు బహుకరించి ప్రసాదములు అందజేశారు. అనంతరం సాయంకాలం ఏర్పాటు చేసిన సంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతో అలరించాయని ఆలయ కార్యనిర్వాహణాధికారి, సహాయ కమిషనర్ రామల సునీత తెలిపారు.

# భక్తి శ్రద్ధలతో పండుగలు: ఇన్ స్పెక్టర్ రమేష్



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** బతుకమ్మ, దసరా ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలసి మిల్స్ కాలనీ ఇన్ స్పెక్టర్ బొల్లం రమేష్, దసరా ఉత్సవ కమిటీ ప్రకటించింది. రంగలీల మైదానంలో మంగళవారం నిర్వహించనున్న బతుకమ్మ ఉత్సవాల ఏర్పాట్లను ఉత్సవ కమిటీలో కలిసి ఇన్ స్పెక్టర్ రమేష్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. వేలాదిగా తరలి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. దసరా ఉత్సవాల సందర్భంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షులు నాగపురి సంజయ్ బాబు, ప్రధాన కార్యదర్శి మేడిది మధుసూదన్, కోశాధికారి మండా వెంకన్న గౌడ్, సహాయ కోశాధికారి వెలిదె శివమూర్తి, ట్రస్ట్ చైర్మన్ వంగరి కోటేశ్వర్, ఉపాధ్యక్షులు గోనె రాంప్రసాద్, నాగపురి రంజిత్ గౌడ్, పొగాకు సందీప్, దామెరకొండ వెంకటేశ్వర్లు, కత్తెరశాల వేణుగోపాల్, బత్తిని అఖిల్ గౌడ్, నాగపురి అశోక్, చిట్ల క్రాంతి, నాగపురి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com